క్లుప్తంగా

170 మందికి వైద్య పరీక్షలు


వైద్యశిబిరంలో పాల్గొన్న గిరిజనులు

అరకులోయటౌన్‌: మండలంలోని బొండాం కొత్తవలస గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం, వైబ్రియోనిక్స్‌(విశాఖపట్నం) సంయుక్తంగా ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బుజ్జిబాబు, రామన్న మాట్లాడుతూ శిబిరంలో 170 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. డాక్టర్‌ జగదీష్‌ బృందం వైద్య సేవలందించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

గూడెంకొత్తవీధి: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మండలంలోని సోమవారం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో జర్రెల పంచాయతీ పరిధిలోని రాళ్లగెడ్డ, కొండ్రుపల్లి, జె.కొత్తూరు, రాచకోటలో గ్రామాల్లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్షిహాజరవుతున్నట్టు పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 3గంటలకు మండల కేంద్రంలోని సచివాలయం-1 వద్ద రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌ కార్యాలయ ఆవరణలో నిరసన తెలియజేస్తున్న వీఆర్‌ఏలు

అరకులోయ టౌన్‌: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏలు మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పద్మాపురం మేజర్‌ పంచాయతీ ఉప సర్పంచ్‌ జె.భగత్‌రామ్‌ మద్దతు తెలుపుతూ మాట్లాడారు. వీఆర్‌ఏల సమస్యలు, డిమాండ్లు పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని కోరారు. వీఆర్‌ఏల సంఘం నాయకులుఅప్పారావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చింతపల్లి, నెల్లిపూడిలలో జగనన్న సురక్ష

గంగవరం: మండలంలోని నెల్లిపూడి గ్రామ సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొంటారని మండల పార్టీ ఇన్‌చార్జి సీహెచ్‌. రఘునాథ్‌ చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి గంగవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

చింతపల్లిరూరల్‌: మండల కేంద్రంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విచ్చేస్తున్నారని, కావున పార్టీ నాయకులు, మండల స్థాయి అధికారులు తరలిరావాలని కోరారు.

17 నుంచి శ్రావణమాస ఉత్సవాలు

అనకాపల్లి రూరల్‌: సత్యనారాయణపురం కనక దుర్గమ్మ ఆలయంలో ఆగస్టు 17 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు తెలిపారు. కల్యాణగిరిపై ఆదివారం నిర్వహించిన సమావేశంలో శ్రావణమాస ఉత్సవాలు, ప్రత్యేక పూజలకు సంబంధించి ఆహ్వాన శుభపత్రికను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం శ్రావణమాసాన్ని పురస్కరించుకుని చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు. వచ్చే నెల 17న శ్రావణ శుద్ధ పాడ్యమి గురువారం ఉదయం 7 గంటలకు కోటి కుంకుమార్చన జరపాలని నిర్ణయించారు. ఆగస్టు 18, 25, సెప్టెంబర్‌ 1, 8 తేదీల్లో కోటి కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు 13న కోటి కుంకుమార్చన ముగింపు సందర్భంగా లలితా సహస్రనామ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని కోరారు.

జోరుగా ఖరీఫ్‌ పనులు


రాళ్లగరువు గ్రామంలోని వరినాట్లల్లో నిమగ్నమైన రైతులు


రాజవొమ్మంగిలో దమ్ము పనుల్లో రైతు

- అన్నదాతలకు మేలు చేస్తున్న వర్షాలు
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన గిరిజన రైతులు

అనంతగిరి: ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇటీవల వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో గిరిజన రైతులు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. మండలంలోని ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్‌ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. మండలంలోని కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు జరుగుతుండడంతో మరికొన్ని ప్రాంతాల్లో దుక్కి పనులు సాగుతున్నాయి. దీంతో పాటు ప్రభుత్వం ముందస్తుగానే రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించడంతో పాటు విత్తనాలు పంపిణీ చేసింది. దీంతో మండలంలోని అన్ని ప్రాంతాల్లో సాగు పనులు జోరుగా జరుగుతున్నాయి. ఆర్‌బీకేల రైతులకు శ్రీకాకుళం సన్నాలు, ఆర్‌జీఎల్‌, ఎమ్‌టీయూ 1121 విత్తనాలను అందిస్తూ ప్రోత్సహించింది. మండల వ్యాప్తంగా కొన్ని చోట్ల వరి నాట్లు పూర్తికాగా, మరి కొన్ని ప్రాంతాల్లో దుక్కి పనులు జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా వరి 2469 హెక్టార్లు, రాగులు 2085 హెక్టార్ల విస్తీర్ణంలో సాగులో ఉన్నట్టు మండల వ్యవసాయాకారి ఉమామహేశ్వరీ చెప్పారు. రైతులకు డీఏపీ, యూరియా అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు. మండలంలోని కాశీపట్నం ఆర్‌బీకేలో-2టన్నులు డీఏపీ, పది టన్నుల యూరియ, బొర్ర ఆర్‌బీకేలో-7 టన్నులు డీఏపీ, ఆరు టన్నులు యూరియ అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతగిరి, ఎగువశోభ, మీగత ఆర్‌బీకేల్లో డీఏపీ, యూరియపై అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు చేపడుతున్నాం. ఖరీఫ్‌ పంటల సాగుపై రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు. దీంతో పాటు ప్రకృతి సాగుపై రైతులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

అనుకూలించిన వాతావరణం

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు మడికట్టు నేలలో సమృద్ధిగా నీరు చేరింది. దీంతో ఖరీఫ్‌ వరి సాగు పనులను రైతులు వేగవంతం చేశారు. ఇప్పటికే రైతులు వేసిన వరి నారు దాదాపు నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉంది. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 1200 క్వింటాళ్ల వరి వంగడాలను అందజేసింది. వరి విత్తనాలు నాణ్యతగా ఉండడంతో వేసిన ప్రతి గింజ మొలచి వరి నారుమడులు కళకళలాడుతున్నాయి. మండలంలో దాదాపు 5వేల ఎకరాల్లో వరి సాగవుతుండగా చాలా చోట్ల పాత పద్ధతిలో నాట్లు వేస్తున్నారు. మరి కొంత మంది నారుమడులు వేయకుండా నేరుగా వెదజల్లు పద్ధతిని అనుసరిస్తున్నారు. వెద జల్లు పద్ధతిలో ఎకరాకు కనీసం 20 నుంచి 25 కిలోల విత్తనాలను ఉపయోగించాలని స్థానిక వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు రైతులను సూచిస్తున్నారు. నాట్లు వేసే పద్ధతిలో పిలకలు పెట్టి వరి చేను దుబ్బు చేస్తుందని, వెదజల్లే పద్ధతిలో చేను దుబ్బు చేయదు కనుక రైతులు ముందే జాగ్రత్త పడి విత్తనాలను అధికంగా దమ్ములో వెదజల్లాలని కోరారు. అలాగే ఈ పద్ధతితో విత్తన శుద్ధి తప్పనిసరి అన్నారు. విత్తనాలతో పాటు ప్రభుత్వం సరఫరా చేసిన సూడోమోనాస్‌ పాడి మందును విత్తనాలకు పట్టించి వెదజల్లుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి వల్ల తెగుళ్లు సోకకుండా పంట ఏపుగా పెరుగుతుందన్నారు.

ఏజెన్సీలో 15 రామాలయాల నిర్మాణం


గ్రామంలో పర్యటిస్తున్న టీటీడీ కమిటీ సభ్యులు

రంపచోడవరం: రంపచోడవరం మండలంలో పలు చోట్ల రామాలయాలను స్థానిక ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌ (అనంత బాబు)లు మంజూరు చేయించడం జరిగిందని మండల సచివాలయ కన్వీనర్‌, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు పండా రామకృష్ణదొర తెలిపారు. దేవాలయాలు నిర్మించే గ్రామాలను ఆదివారం టీటీడీ కమిటీ సభ్యులతో కలిసి సందర్శించినట్టు తెలిపారు. కమిటీతో కలిసి 15 చోట్ల పర్యటించినట్టు పేర్కొన్నారు. ఒక్కో ఆలయానికి రూ. 30 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. సోమవారం కూడా మరి కొన్ని గ్రామాలను సందర్శించనున్నట్టు పేర్కొన్నారు. అన్నవరం దేవస్థానం బోర్డు డైరెక్టర్‌ కారుకోడి పూజ, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, నందూరి రాంబాబు, గ్రామస్తులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పరదేశమ్మ మండప నిర్మాణానికి భూమి పూజ


కొండకర్ల అందలాపల్లి పరదేశమ్మ ఆలయంలో మండప నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల అందలాపల్లి గ్రామంలో ఆదివారం పరదేశమ్మ వారి గుడి ముందు మండపం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భర్త కోన బుజ్జి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, కోట్ని శివలు కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


ఇరుకువలసలో ఆలయ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం, దేవదాయశాఖ సిబ్బంది

హుకుంపేట: మండలంలోని ఇరుకువలస, అడపరాయి, బంగారుబుడి, రామచంద్రపురం తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం దేవదాయ శాఖ అధికారులతో ఆదివారం పర్యటించారు. ఈ నేపథ్యంలో ఇరుకువలస గ్రామంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రామాలయం పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలన్నారు. గ్రామంలో ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ రూ.10లక్షలు మంజూరు చేసిందన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ సెదా, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల దిగుబడికి మీనామృతం దోహదం


వాతంగి గ్రామంలో మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయంలో పండిస్తున్న పంటల దిగుబడికి మీనామృతం ఎంతో దోహదపడుతుందని రైతు సాధికార సంస్థ మండల ఇన్‌చార్జి జె వెంకట్‌, ఎం.నిట్టాపుట్టు యూనిట్‌ ఇన్‌చార్జి ఎం.ప్రసాద్‌, భీరం యూనిట్‌ ఇన్‌ఛార్జీ ఎస్‌ రామలింగం తెలిపారు. మండలంలో భీరం పంచాయతీలో పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయలో పండిస్తున్న పంటల దిగుబడులు సాధించటానికి వినియోగించే మీనామృతం తయారీ, దాని ఉపయోగాలు వారు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చేపల వ్యర్థాలతో బెల్లం కలిపి 15రోజుల పాటు మురుగబెట్టి 2లీటర్లు తయారైన మీనామృతానికి 10లీటర్లు ఆవు మూత్రం 100లీటర్లు నీరు కలిపి వరిలో పిచికారీ చేయాలని సూచించారు. ఇందులో భీరంలో 20కిలోల చేపవ్యర్థాలు, 20లీలల బెల్లంతో ఎస్‌పీఎం షాపు వద్ద తయారీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రంపచోడవరం: ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంటలు పండించవచ్చని రంపచోడవరం వైస్‌ ఎంపీపీ పండా కుమారి, అన్నవరం దేవస్థానం డైరెక్టర్‌ కారుకోడి పూజలు అన్నారు. రంపచోడవరం, పోక్సుపేటల్లో ఆదివారం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మీనామృతం తయారీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మీనామృతం వాడడం వలన పంటలలో వచ్చే పోషకాల లోపలను అధిగమించవచ్చని రంపచోడవరం యూనిట్‌ ఇన్‌చార్జి సత్యవతి అన్నారు. నాణ్యమైన దిగుబడి, మొక్కలు ఏపుగా పెరగడానికి, భూమిలో సూక్ష్మ పోషకాలు పెరుగుదలకు మీనామృతం దోహదం చేస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో క్షేత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రంపచోడవరంలో-20 లీటర్లు, పోక్సుపేటలో-10లీటర్లు మీనామృతం తయారు చేశారు. సర్పంచ్‌ పండా లక్ష్మి, ఎంటీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని కొమరాపురం, కిండ్రకాలనీలలో ఆదివారం ప్రకృతి సాగుపై రైతు సాధికార సంస్థ ఏపీసీఎన్‌ఎఫ్‌ ప్రాజెక్టు సీఆర్పీలు అవగాహనాకార్యక్రమాలు చేపట్టారు. కొమరాజురం యూనిట్‌ వాతంగి గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. మీనామృతం తయారు చేసే విధానాన్ని వివరించారు. ఇందుకు ఐదు కిలోల చేపలు, నాలుగు కిలోల నల్లబెల్లం ఉపయోగించి ఆ ద్రావణాన్ని పంటలపై పిచికారీ చేసుకోవాలని శోదాహరణగా వివరించారు. దీని వల్ల పంటలు ఏపుగా పెరిగి మంచి దిగుబడులు ఇస్తాయన్నారు. ఐసీఆర్పీలు లోవరెడ్డి, లక్ష్మణరెడ్డి, సత్యన్నారాయణ రైతులు పాల్గొన్నారు. మీనామృతం, దశపర్ని కషాయం తయారు చేశారు. ఈ కషాయాలు పంటలపై ఏ విధంగా పనిచేస్తాయో వివరించారు. ఎల్‌-2 నాగరాజు, రైతులు పాల్గొన్నారు. పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం వైపు గిరి రైతులు ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడి వ్యవసాయం చేపడితే ఇబ్బడి ముబ్బడిగా ఖర్చులు పెరిగిపోయి నష్టాలపాలౌతున్నట్లు తెలుసుకొంటున్నారు. దీనితో ప్రకృతి సేద్యంపై రైతులు మొగ్గు చూపుతున్నారు.


పోక్సుపేటలో మీనామృతం తయారీని పర్యవేక్షిస్తున్న వైస్‌ ఎంపీపీ కుమారి


భీరం గ్రామంలో రైతులకు మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగ మండల ఇన్‌చార్జి వెంకట్‌

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


సర్వసిద్ధిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఎస్‌.రాయవరం : ఎస్‌.రాయవరం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సర్వసిద్ధి గ్రామంలో ఆదివారం గెట్‌ టుగెదర్‌ నిర్వహించుకున్నారు. 1994-95 సంవత్సరాల్లో ఎస్‌.రాయవరం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న ఈ విద్యార్థులు సుమారు 28 సంవత్సరాలు తరువాత కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలు, చిలిపి కబుర్లు గుర్తుకు తెచ్చుకుని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థి దశకు ఇప్పటికి వారి వారి రూపు రేఖలు బాగా మార్పు రావడంతో ఒకరినొకరు గుర్తు పట్టడంలో కబుర్లు చెప్పుకుని కేరింతలు కొట్టారు. సర్వసిద్ధి గ్రామం సమీపంలో కొబ్బరితోట నీడలు సందడి చేసిన పూర్తి విద్యార్థులు మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి కబుర్లు చెప్పుకుని సాయంత్రం వరకు సందడి చేశారు.

ఘనంగా కోయ బాల సాహిత్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సోడె మురళి

చింతూరు: ఆదివాసీ సంక్షేమ పరిషత్‌ ఆధ్వర్యంలో ఆదివారం చింతూరులో కోయ బాలసాహిత్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్‌ ప్రచార కార్యదర్శి సోడె మురళి మాట్లాడుతూ కోయ భాషకు లిపి లేకున్నా బాలసాహిత్యాన్ని కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలన్నారు. రానున్న తరాలకు కోయ బాలసాహిత్య కథలు, చరిత్ర, పద్యాలు, సామెతలు అందించేందుకు పుస్తకం రూపొందించేందుకు పాటు పడాలని, కోయభాషలో విద్యాబోధనకు ఉపాధ్యాయులను నియమించాలని ఆయన కోరారు. మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులు హేయమైన చర్య అన్నారు. పరిషత్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను, కృష్ణ, సత్యనారాయణ, చిన్నబ్బి, వీరయ్య, వెంకటేష్‌ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం


వాలీబాల్‌ కిట్‌లను పంపిణీ చేస్తున్న జిల్లా గ్రీవెన్స్‌ సెల్‌ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్‌

సాక్షి,పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌ సెల్‌ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. సలుగు పంచాయతీ కక్కి గ్రామాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. గ్రామంలో యువకులకు వాలీబాల్‌ కిట్‌లను ఆయన పంపిణీ చేశారు. నాయకులు, గిరిజనులతో సమావేశమయ్యారు. తాగునీరు, రోడ్ల అభివృద్ధి సమస్యలను ఎంపీటీసీ దీసరి మీనా, నాయకులు గంగరాజులు కోరారు. ఈ సందర్భంగా మహేష్‌ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి దృష్టికి తీసుకెళ్తామన్నారు. టిలీకం అడ్డైయి జరీ కమిటీ సభ్యుడు సందీప్‌, వార్డు సభ్యుడు ఈశ్వరరావు, నాయకులు సుబ్బారావు, శ్రీను, సాయిప్రసాద్‌, కృష్ణారావు, రాజారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌ సంఘటనకు వ్యతిరేకంగా ర్యాలీలు



అరకులోయలో నాలుగురోడ్ల జంక్షన్‌ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, గిరిజన సంఘం నాయకులు

అరకులోయటౌన్‌/కొయ్యూరు/కూనవరం: మణిపూర్‌లో జరిగిన ఘటనను వ్యతిరేకిస్తూ జిల్లాలోని అరకులోయ, కొయ్యూరు, కూనవరం ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు, గిరిజన సంఘాలు ఆదివారం నిరసన ర్యాలీలు చేశారు. అరకులోయలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్‌ ఆధ్వర్యంలో స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద రాస్తారోకో చేపట్టారు. డిగ్రీ కాలేజీ నుంచి పట్టణం మెయిన్‌రోడ్డు మీదుగా నాలుగురోడ్ల కూడలి వరకు విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. బాధితులకు న్యాయం జరిగే పోరాటాలు చేస్తామన్నారు. నాయకులు రామన్న, జయ, ధనలక్ష్మి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: రాజేంద్రపాలెంలో ఎస్‌ఎఫ్‌ఐ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. నాయకులు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండల పరిధిలోని రేపాక, చినార్కూరు గ్రామాల్లో గిరిజన సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం ప్లకార్డులతో నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్‌ మడకం నాగమణి, పాయం జ్యోతి, ఐద్వా నాయకురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

అరకులోయటౌన్‌: మణిపూర్‌ ఆదివాసీ మహిళలపై అత్యాచారం, మారణహోమం అరికట్టడంలో విఫలమైన మణిపూర్‌ ముఖ్యమంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆదివాసీ మహిళలపై జరుగుతున్న మారణహోమంపై రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకోవాలని రౌండ్‌ టేబుల్‌లో పాల్గొన్న వక్తలు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పొద్దు బాలదేవ్‌, తదితరులు డిమాండ్‌ చేశారు. గిరిజన సఘం కార్యాలయంలో వివిధ సంఘాల ప్రతినిధులతో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. దోషులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన శిక్ష విధించాలన్నారు. మణిపూర్‌లో ఆదివాసీల ఆస్తులకు రక్షణ కల్పించి, ఆ ప్రాంతంలో శాంతి నెలకొల్పాలన్నారు. ఎంఈఓ త్రినాథరావు, ఆదివాసీ ఉపాధ్యాయ, ఉద్యోగ,వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పి.రామన్న, జయ, కృష్ణకుమారి, రఘునాథ్‌, చిట్టిబాబు, నారాయణ, బాలకృష్ణ, చట్టు మోహన్‌, సింహాద్రి, గోవర్ధన్‌, నాగేంద్ర,పాల్గొన్నారు.



రాజేంద్రపాలెంలో ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, గిరిజన సంఘం నేతలు


రేపాకలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



మునగపాక : మునగపాక అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామికి పంచామృత అభిషేకం అలాగే విశేష అర్చన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చల్లంగా చూడమ్మా.. నూకాలమ్మ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్‌: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతికరమైన ఆదివారం కావడంతో దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలోని చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్‌ ఏర్పాట్లను పర్యవేక్షించారు.